PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

శుక్రవారం 23-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :142 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## విదేశాల్లో ఉన్నారుగా.. నా మాటలు వినిపించవ్వులే

### రాహుల్‌పై అమిత్ షా సెటైర్



2లో

"మీరు విదేశాల్లో ఉండటంతో నా మాటలు వినలేరని నాకు తెలుసు. మీరు ఎందుకు విదేశాలకు వెళ్తారో చెప్పరు. సరేలే.. అది మీ వ్యక్తిగతం. కానీ ఒకసారి ఢిల్లీకి తిరిగివచ్చిన తర్వాత నా మాటలు వినండి. మరో 30 ఏళ్ల వరకు మీరు అధికారంలోకి రారు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని ప్రస్తావించారు.

## మెటాకు రూ. 2.3 లక్షల కోట్ల ఫైన్..

### డేటా గోప్యత ఉల్లంఘన ఫలితం

- ఈ డేటా ఉల్లంఘనలపై న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రౌల్ టోరెజ్ 2021లో మెటాపై దావావేశారు.
- యూజర్ల డేటా ఎవరి చేతికి వెళ్తుందనే విషయంలో కంపెనీ అబద్ధాలు చెప్పిందని ఆరోపించారు.
- ఈ కేసులో మెటాకు 219 బిలియన్ డాలర్ల మేర పెనాల్టీ పడుతుందని వార్తలు వచ్చాయి.




2లో

## ఇన్‌స్టాలోకి సోనియా గాంధీ..

### తొలి పోస్టు ఇదే

సోనియా గాంధీ



2లో

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఇన్‌స్టాగ్రామ్‌లోకి అడుగుపెట్టారు. గురువారం ఈ సోషల్‌మీడియా వేదికపైకి వచ్చిన ఆమె.. తొలి పోస్టు పెట్టారు. ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో దానికి సంబంధించిన కొన్ని దృశ్యాలను షేర్ చేశారు

## చంద్రబాబు నివాసానికి పవన్..

### తాజా పరిణామాలపై చర్చ



ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెళ్లారు. మున్సిపల్ ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాలు, తాజా పరిణామాలపై సీఎంతో పవన్ చర్చించారు. దీంతో పాటు స్థానిక ఎన్నికల్లో రెబల్స్ వ్యవహారంపైనా సమాలోచనలు జరిపినట్లు సమాచారం.

2లో

# పండుగ సాయన్న పోరాటం ఎందరికో ఆదర్శం

### పేదలకు భూములు పంచిన పండుగ సాయన్న పోరాటం చిరస్మరణీయం.



- సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహిస్తాం.
- ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాల ఏర్పాటు.
- ముదిరాజ్‌లకు సంపూర్ణ న్యాయం చేస్తాం.. రాజకీయ అవకాశాలు కల్పిస్తాం.
- ఏడాదిలోనే కులగణన పూర్తి.. బీసీలకు న్యాయం చేయడమే లక్ష్యం.
- రాష్ట్రంలో 3.48 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం పంపిణీ.

2లో▸

## 'జైభవానీ' నామస్మరణతో మార్మోగిన ఇంద్రకీలాద్రి



## కేసీఆర్, రేవంత్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారు:



2లో

తెలంగాణలో రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు.

## మా ప్రభుత్వంలో ముదిరాజ్‌లను భాగస్వాములను చేసే బాధ్యత నాది

- తమ ప్రభుత్వంలో ముదిరాజ్‌లను భాగస్వాములను చేసే బాధ్యత తనదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజులేనని..
- వారు విశ్వాసనీయమైన వారని కొనియాడారు.



నాడు ఎన్టీఆర్ హయాంలో రూ.2లకు కిలో బియ్యం ఇస్తే.. తాము ఇప్పుడు సన్నబియ్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 3.48 కోట్ల మందికి నేడు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈరోజు (గురువారం) హైదరాబాద్‌లో పండుగ సాయన్న జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని, మాట్లాడారు.

- భూస్వాములు పేదల భూములను ఆక్రమిస్తే పండుగ సాయన్న ఎదురుతిరిగారని చెప్పారు.
- పండుగ సాయన్నను అన్యాయంగా హత్య చేశారని..
- ఆయన చనిపోయి వందేళ్లు దాటినా నేటికీ నాట్లు, కోతల సమయంలో పండుగ సాయన్న పాటలు వినిపిస్తున్నాయని తెలిపారు.

## మాజీ మంత్రి యనమలకు అస్వస్థత



# సంపాదకీయం

## అల్లా తేరో నామ్, ఈశ్వర్ తేరో నామ్' ఆలాపన గతమేనా?

ఇరవై సంవత్సరాల క్రితం ఒక విద్యా గోష్ఠిలో పాల్గొనేందుకై లాహోర్‌కు వెళ్లాను. శాస్త్రీయ సంగీత గాయకుడిగా పేరు పొందాలని అభిలషిస్తున్న ఒక యువకుడు అక్కడ నాకు పరిచయమయ్యాడు. శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించేందుకు అతడు ప్రతి వారం కరాచీలోని తన ఉపాధ్యాయుడి వద్దకు వెళ్లేవాడు. నాకు సంగీత ప్రతిభ నాస్తి. అయితే హిందుస్థానీ సంగీతంపై విశేష ఆసక్తి ఉన్నది. ఆ స్వరసుధకు నేను జీవితపర్యంతం ప్రగాఢాభిమానిని.తన సంగీత గురువు ఒక నిర్దిష్ట రాగం గురించి చులకనగా మాట్లాడుతూ, అది హిందువుల రాగమని హేళన చేశారంటూ ఆ యువకుడు చెప్పినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. భారత్‌లోని శాస్త్రీయ సంగీత విద్వాంసులకు అటువంటి దురభిప్రాయాలు లేవని ఆ పాకిస్థానీకి చెప్పేందుకు నాకు మనసురాలేదు. అతడు ఎంతగానో అభిమానించే రోషనారా బేగం, పాకిస్థాన్‌లో స్థిరపడిన తరువాత కూడా శంకర, దుర్గ రాగాలను ఆలపించడం కొనసాగించారనీ చెప్పలేకపోయాను. ఆ రాగాలకు హిందూ దేవతల పేర్లు ఉన్నప్పటికీ ఆమె వాటిని ఆలపించేవారని కూడా అనలేకపోయాను. పాకిస్థాన్‌లో నివసించే సలామత్ అలీఖాన్ గానం చేసిన ఠుమ్రీ 'నదియా కినారే మోరా గావ్' గురించి కూడా నేను ప్రస్తావించి ఉండాల్సింది.

నిన్నటి నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ, నేటి ప్రైమ్ మినిస్టర్స్ మెమోరియల్ లైబ్రరీలో గాంధీకి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను అధ్యయనం చేస్తున్నప్పుడు నాకు లాహోర్‌లో నాటి సంభాషణ గుర్తుకు వచ్చింది. లైబ్రరీలో ఉన్న గాంధీ పేపర్స్ చాలావరకు స్వాతంత్ర్య సమరయోధుడిగా, సాంఘిక సంస్కర్తగా ఆయన చేసిన కృషికి సంబంధించినవే. అయితే ఆశ్చర్యంగా శాస్త్రీయ సంగీత విద్వాంసులతో ఆయన ఉత్తర ప్రత్యుత్తరాలు ఉన్న ఫైల్ ఒకటి నా దృష్టికి వచ్చింది. 1944 నవంబర్‌లో ప్రముఖ హిందుస్థానీ గాయకుడు ఓంకార్‌నాథ్ ఠాకూర్ గాంధీకి రాసిన లేఖ ఒకటి ఆ ఫైల్‌లో ఉంది. బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ ఆఫ్ మ్యూజిక్‌ను ప్రారంభించేందుకు మహాత్ముని సహాయాన్ని కోరుతూ ఠాకూర్ రాసిన లేఖ అది. 'ప్రతిపాదిత ఫ్యాకల్టీ భారతీయ శాస్త్రీయ సంగీతంలోని సమస్త సంప్రదాయాలను క్రమబద్ధంగా అధ్యయనం చేస్తుంది. ఏ శైలి పట్లా ఎటువంటి పక్షపాతం లేదా వివక్ష చూపడం జరగదు. భారతీయ సాంస్కృతిక జీవనంలో సంగీతానికి ఉన్న ప్రముఖ స్థానం, భారతీయ నాగరికతలో మిళితమైన వివిధ ప్రవృత్తులు, ధోరణులను సమన్వయం చేయడంలో శాస్త్రీయ సంగీతానికి ఉన్న విలువ, ప్రాధాన్యం అందరికీ తెలిసినవే'నని ఠాకూర్ పేర్కొన్నారు.ఠాకూర్ ప్రతిపాదనను విస్తరిస్తూ దక్షిణ భారతీయ సంగీతవేత్త పరూర్ సుందరం అయ్యర్ రాసిన లేఖ కూడా ఆ ఫైల్‌లో ఉన్నది. కర్ణాటక సంగీత విద్వాంసుడు అయిన ఈ మలయాళీ, విష్ణుదిగంబర్ పలూస్కర్ నెలకొల్పిన 'గాంధర్వ మహా విద్యాలయం' అనే సంగీత పాఠశాలలో బోధించేందుకు అప్పట్లో బొంబాయిలో ఉన్నారు. ఆ పాఠశాలలో ఓంకార్‌నాథ్ ఠాకూర్, నారాయణరావు ఖరే మొదలైనవారు అయ్యర్ సహచర అధ్యాపకులు. ఖరే ఆ తరువాత గాంధీజీ సబర్మతి ఆశ్రమంలో సంగీత ఉపాధ్యాయుడిగా ఉన్నారు. 1944 నవంబర్ 7న గాంధీజీకి అయ్యర్ రాసిన లేఖలో సంగీత సంప్రదాయాల అధ్యయనంలో తన ఆసక్తులు, సంగీతవేత్తగా తన శిక్షణ నేపథ్యాల గురించి రాస్తూ... '1927లో కాంగ్రెస్ మహాసభ సందర్భంగా మీరు మద్రాసులో ఉన్నప్పుడు, మిమ్ములను నా వయొలిన్‌తో ఉల్లాసపరిచిన గౌరవం నాకు దక్కింది' అని పేర్కొన్నారు. ఆ తరువాత ఇలా రాశారు-- 'భారతదేశానికి ఒక సంగీత విశ్వవిద్యాలయం అవసరం. దానిని ఏర్పాటు చేయడమనేది చాలా సంవత్సరాలుగా జరుగుతున్న వివిధ సంగీత మహాసభల కార్యక్రమాలకు తలమానికం అవుతుంది. కనుక ఒక సంగీత విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మీరు తోడ్పడాలి'. అయ్యర్ ఇంకా ఇలా రాశారు-- 'మీ ఆశీస్సులు ఉంటే ఏదైనా గొప్పగా సఫలమవుతుంది. హిందువులు, ముస్లింల మధ్య సహోదరభావాన్ని నెలకొల్పేందుకు సంగీతం ప్రభావశీలంగా తోడ్పడుతుంది. హిందూ, ముస్లిం గాయకులు ఎటువంటి వివాదాలకు తావులేకుండా న్యామత్ ఖాన్ (సదారంగ గా సుప్రసిద్ధుడు), కబీర్, తులసి, మీరా గీతాలను గానం చేస్తున్నారు'. అయ్యర్ తన లేఖను ఇలా ముగించారు-- 'మహాత్మాజీ త్వరలోనే సంగీత విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి, మన మహోదాత్త సంగీత సంస్కృతి గౌరవాన్ని కాపాడతారని ఆశిస్తున్నాను. విశ్వవిద్యాలయం ప్రారంభమైన వెంటనే హిందూ ముస్లిం ఐక్యత సత్వరమే విస్తరిస్తుంది. మనకు శీఘ్రగతిన స్వరాజ్యం సిద్ధిస్తుంది'.ఓంకార్‌నాథ్ ఠాకూర్ భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ఒక సమన్వయకర్తగా అభివర్ణించగా అయ్యర్ అది హిందూ--ముస్లిం ఐక్యతకు ఒక ముఖ్య సాధనమని స్పష్టంగా పేర్కొన్నారు. అయ్యర్ తన సొంత జీవితానుభవాలతోనే ఈ మాట చెప్పారు (కిరాణా ఘరానా ఉస్తాద్ అబ్దుల్‌కరీమ్‌కు ఆయన గొప్ప అభిమాని మాత్రమే కాకుండా బాగా సన్నిహితుడు కూడా). దురదృష్టవశాత్తూ అయ్యర్ లేఖకు గాంధీ ప్రత్యుత్తరమిచ్చిన దాఖలాలు కనిపించలేదు. ఠాకూర్ లేఖకు మాత్రం క్లుప్తంగా సమాధానమిచ్చారు. రాజకీయ ప్రాపకం, కార్పొరేట్ నిధులతో సంగీతం వర్ధిల్లదని, ఒక సంస్థలో సహజసిద్ధంగా మాత్రమే ఆ గాంధర్వ కళ వికసిస్తుందని, ఈ విషయంలో రవీంద్రుని శాంతినికేతన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఠాకూర్‌కు గాంధీ సూచించారు.గాంధీ 1948లో కీర్తిశేషుడు అయ్యారు. రెండు సంవత్సరాల అనంతరం బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ ఆఫ్ మ్యూజిక్ (సంగీత అధ్యయన విభాగం) ఏర్పాటయింది. ఓంకార్‌నాథ్ ఠాకూర్ ఆ ఫ్యాకల్టీ ప్రధానాచార్యుడు. అదే కాలంలో సుందరం అయ్యర్ మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా సంగీత అధ్యయనాలను సమున్నతం చేస్తున్నారు. ఇదిలావుండగా కర్ణాటక సంగీత సంప్రదాయంలో సుశిక్షితురాలు, యువ వాయులీన (వయొలిన్) విద్వాంసురాలు ఒకరు ఠాకూర్ విద్యార్థి అయ్యేందుకు బనారస్‌కు వెళ్లారు. ఆయన మార్గదర్శకత్వంలో సంగీత శిఖరాలను అధిరోహించడమే ఆ యువ సంగీత విద్వాంసురాలి లక్ష్యం. ఆ గాంధర్వి ఎన్.రాజం. అష్టపదుల వయసులో ఉన్న రాజం ఇప్పటికీ సంగీత కచేరీలు నిర్వహిస్తూ స్వరలయల రసికులను అలరిస్తున్నారు. సజీవ భారతీయ శాస్త్రీయ సంగీతకారులలో మహోన్నత వాద్య విద్వాంసురాలిగా ఎన్.రాజంకు సువిఖ్యాతి ఉన్నది.

బనారస్‌లో నివసిస్తున్న ఈ తమిళ మహిళ... ఆ పుణ్యక్షేత్ర స్థానికుడు, గంగామాయి బిడ్డ అయిన బిస్మిల్లాఖాన్‌తో కలిసి కొన్ని మరపురాని జుగల్బందీలను నిర్వహించారు. హిందూ ముస్లింల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో సంగీతం ఎంత శక్తిమంతమైన పాత్ర పోషిస్తుందో చెప్పడానికి రాజం--బిస్మిల్లా సంయుక్త కచేరీలే (యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్నాయి) అద్భుత నిదర్శనాలు. హిందుస్థానీ సంగీతానికి షహనాయి ఎలాంటిదో కర్ణాటక సంగీతానికి నాదస్వరం అలాంటిది. బిస్మిల్లాఖాన్ సంగీత సరస్వతికి దక్షిణ భారత ప్రతిరూపం నాదస్వర విద్వాంసుడు షేక్ చిన్న మౌలానా. మౌలానా సాహెబ్ దేవాలయ పట్టణమైన శ్రీరంగంలో నివసిస్తూ నిత్యం నాదస్వర వాద్యంతో దైవార్చన చేస్తుండేవారు. గాంధీకి రాసిన లేఖలో పరూర్ సుందరం అయ్యర్ కొనియాడిన మత సామరస్యానికి ఇది మరొక నిదర్శనం.భారతీయ శాస్త్రీయ సంగీత జగత్తులోని విశిష్ట మానవీయ అంశం మత సామరస్యం మరే ఇతర రంగంలో కంటే శాస్త్రీయ సంగీతంలోనే హిందువులు--ముస్లింలు పరస్పర సోదరభావంతో జీవించారు, కలిసి శ్రమించారు. సప్తస్వరాల సృజనసాధనల్లో కలిసికట్టుగా ద్రష్ట, స్రష్టలుగా వెలుగొందారు. హిందువులు అయిన మహోన్నత సంగీతవేత్తలు ముస్లిం ఉస్తాద్‌ల మార్గదర్శకత్వంలో సుశిక్షితులై వారికి ఎంతగానో రుణపడి ఉన్నారు. కేసరిబాయి కేర్కర్‌కు అల్లాదియా ఖాన్ ఎలాంటివారో, లేదా అల్లావుద్దీన్‌ఖాన్ పండిట్ రవిశంకర్‌కు ఎలాంటివారో శాస్త్రీయ సంగీత రసికులందరికీ తెలుసు. ముస్లింల సంగీత సృజన పద్ధతులపై హిందూ సంగీతవేత్తల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఉదాహరణకు ఆగ్రా ఘరానా విద్వాంసులు షరాఫత్, లతాఫత్ హుస్సేన్‌ఖాన్?లు యమన్ రాగంలో గానం చేసిన కృతులను వినండి.. అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతినిచ్చే గానలహరులవి. వాటిలో ఒకటి 'దర్శన్ దేవో శంకర్ మహదేవా'. ఆ కృతి ఆలాపనతో ఆ ముస్లిం గాయకులు హిందూ దేవుడైన శివుడిని తన దివ్యరూపాన్ని సాక్షాత్కరింపజేయమని ప్రార్థిస్తారు.మన సంగీత సంప్రదాయాల విశాల, సమ్మిళిత సంస్కృతిని దేశ విభజన విచ్ఛిన్నం చేసింది. ఈ సాంస్కృతిక నష్టం మొదట పాకిస్థాన్‌లో వాటిల్లింది. శాశ్వతమైన నష్టమది. ఈ కారణంగానే యువ పాకిస్థానీ గాయనీగాయకులకు రోషనారా బేగమ్, సలామత్ అలీఖాన్‌ల సంగీతంలోని హిందూ ఇతివృత్తాల గురించి అవగాహన లేదు. ఈ అజ్ఞానాన్ని సహించలేకనే బడే గులామ్ అలీఖాన్ 1950ల్లో ముస్లింల పవిత్రభూమి నుంచి భారత్‌కు తిరిగివచ్చేశారు.

## మా ప్రభుత్వంలో ముదిరాజ్‌లను భాగస్వాములను చేసే బాధ్యత నాది: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్, అక్టోబరు 22 : తమ ప్రభుత్వంలో ముదిరాజ్‌లను భాగస్వాములను చేసే బాధ్యత తనదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజులేనని.. వారు విశ్వాసనీయమైన వారని కొనియాడారు. భూస్వాములు పేదల భూములను ఆక్రమిస్తే పండుగ సాయన్న ఎదురుతిరిగారని చెప్పారు. పండుగ సాయన్నను అన్యాయంగా హత్య చేశారని.. ఆయన చనిపోయి వందేళ్లు దాటినా నేటికీ నాట్లు, కోతల సమయంలో పండుగ సాయన్న పాటలు వినిపిస్తున్నాయని తెలిపారు.

మా ప్రభుత్వం కులగణన చేపట్టింది..

బ్రిటిష్ హయాంలో కులగణన చేశారని.. వందేళ్ల తర్వాత తమ ప్రభుత్వం కులగణన చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. కులగణన చేసినందుకనే ఈ రోజు బలంగా ప్రతి కులం.. తమ గళం వినిపిస్తోందని అన్నారు. ఎవరైనా కులగణనలో తమ జనాభా తక్కువగా ఉందని భావిస్తే పూర్తి వివరాలిస్తే లెక్కలను సవరిస్తామని చెప్పారు. లెక్కలు లేనందునే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ కు మార్చలేకపోయారని అన్నారు. ఈ అంశంపై వచ్చే క్యాబినెట్ భేటీలో చర్చిస్తామని మాటిచ్చారు. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో అధ్యయనం చేయిస్తామని వెల్లడించారు. ఈ అంశంపై ఇతర కులాలకు ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉందని తెలిపారు.

జఠిలమైన ఎస్సీ వర్గీకరణను అమలు చేశాం..

జఠిలమైన ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. బీసీ కులగణన చేపట్టామని అన్నారు. తాను గతంలో టీపీసీసీ అధ్యక్షుడిని కాగానే శ్రీహరి ముదిరాజ్‌ను డీసీసీ ప్రెసిడెంట్‌గా నియమించానని తెలిపారు. శ్రీహరికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చానని.. మంత్రిని చేశానని వ్యాఖ్యానించారు. నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చానని తెలిపారు. ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.

## కేసీఆర్, రేవంత్ ఒకరినొకరు కాపాడుకుంటున్నారు: ఎంపీ అరవింద్

మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్: తెలంగాణలో రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ప్రకటించిన తర్వాతే క్రాప్ హాలిడే గురించి నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అరవింద్ పలు విమర్శలు చేశారు. సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ల మార్పుల వెనుక భారీ అవినీతి ఉందని ఆయన ఆరోపించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలవడం ఖాయమని అరవింద్ వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉందని వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా 2029 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను రాజకీయంగా గల్లంతు చేస్తామని ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సునామీ సృష్టిస్తుందని అన్నారు. ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. ముఖ్యంగా పసుపు రైతులకు క్వింటాల్‌కు రూ.50 వేల ధర లభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందుకు సంబంధించిన కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. అవసరమైతే ఈ హామీపై బాండ్ పేపర్ రాసి ఇస్తానని అన్నారు.మరోవైపు, తెలంగాణలో రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలు నిలిచిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని అరవింద్ ఆరోపించారు. నిజామాబాద్‌లోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం విషయంలో త్వరలో ఆందోళన చేపడతామని ప్రకటించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. రైతుల సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులు, పసుపు ధరలు, మాధవనగర్ ఆర్వోబీ అంశాలపై ఎంపీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

## చంద్రబాబు నివాసానికి పవన్.. తాజా పరిణామాలపై చర్చ

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెళ్లారు. మున్సిపల్ ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాలు, తాజా పరిణామాలపై సీఎంతో పవన్ చర్చించారు. దీంతో పాటు స్థానిక ఎన్నికల్లో రెబల్స్ వ్యవహారంపైనా సమాలోచనలు జరిపినట్లు సమాచారం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా వీరిద్దరూ చర్చించినట్లు తెలిసింది. సీఎం నివాసానికి పవన్ ఎలాంటి సెక్యూరిటీ, కాన్వాయ్ లేకుండా ఒంటరిగా వచ్చారు. కొద్దిసేపు చంద్రబాబుతో చర్చించిన అనంతరం ఆయన తిరిగి వెళ్లిపోయారు.

## విదేశాల్లో ఉన్నారుగా.. నా మాటలు వినిపించవులే: రాహుల్‌పై అమిత్ షా సెటైర్

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ దిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. మరో 30 ఏళ్లపాటు ఆయన పార్టీ అధికారానికి దూరంగా ఉంటుందని జోస్యం చెప్పారు.

"మీరు విదేశాల్లో ఉండటంతో నా మాటలు వినలేరని నాకు తెలుసు. మీరు ఎందుకు విదేశాలకు వెళ్తారో చెప్పరు. సరేలే.. అది మీ వ్యక్తిగతం. కానీ ఒకసారి దిల్లీకి తిరిగివచ్చిన తర్వాత నా మాటలు వినండి. మరో 30 ఏళ్ల వరకు మీరు అధికారంలోకి రారు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

అలాగే, దేశ రాజధానిలో నిరసనల గురించి అమిత్ షా స్పందించారు. నిరసనలు, ప్రదర్శనల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, రాజకీయ నాయకులు ప్రజాసంక్షేమంపై దృష్టిపెట్టాలని సూచించారు. "గుంపులుగా రావడం, రాజకీయ గారడీ వల్ల ప్రజాతీర్పును ధిక్కరించడం సాధ్యం కాదు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలి. మీరు ఎన్నికైన చోటల్లా సంక్షేమ పథకాలు అమలు చేయండి. లేదంటే మిగిలిన ప్రాంతాల్లో ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోతారు" అని విపక్ష పార్టీలకు సూచించారు.

"రాహుల్‌జీ.. మీరు చొరబాటుదార్ల ఓట్లను కాపాడాలని అనుకుంటున్నారు కాబట్టే ప్రతిసారి 'ఓటు చోరీ' గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు భాజపాపై ఓటు చోరీ ఆరోపణలు చేస్తున్నాయి. కానీ, ఆ పార్టీలు మాత్రం పలు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉన్నాయి. భాజపా 30 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని నేను చెప్పగానే.. వెంటనే ఓటు చోరీ అంటూ ఆరోపిస్తారు. అమిత్‌షాకు ఎన్నికల ఫలితాలు ముందుగానే ఎలా తెలుస్తాయని అడుగుతుంటారు. అమిత్ షా ఇక్కడే పుట్టారు. ఈ దేశంలోనే నివసిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి విదేశాలకు వెళ్లాల్సిన అవసరం నాకు లేదు. నేను ఈ ప్రజల మధ్యే నివసిస్తున్నాను" అంటూ విపక్షాల నిరసనలకు అమిత్ షా కౌంటర్ ఇచ్చారు.

## మెటాకు రూ. 2.3 లక్షల కోట్ల ఫైన్.. డేటా గోప్యత ఉల్లంఘన ఫలితం

మొదటిపేజీ తరువాయి

టెక్ దిగ్గజం మెటాక్‌కు భారీ షాక్ తగిలింది. న్యూ మెక్సికో కోర్టు 25 బిలియన్ డాలర్లు (రూ.2.3 లక్షల కోట్లు) పెనాల్టీ విధించింది. డేటా గోప్యత విషయంలో యూజర్లను కంపెనీ తప్పుదారి పట్టించిందని మెటాపై ఆరోపణలు రాగా.. ఈ కేసులో న్యూ మెక్సికో కోర్టు తాజాగా దోషిగా తేల్చింది. ఆ పెనాల్టీ మొత్తాన్ని న్యూమెక్సికో రాష్ట్రానికి చెల్లించాలని ఆదేశించింది. అమెరికా చరిత్రలో ఒక కంపెనీపై విధించిన జరిమానాల్లో ఇది ఒకటిగా నిలిచింది.

అసలు ఈ కేసు ఏంటి..?

2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో మిలియన్ల కొద్దీ ఫేస్‌బుక్ (ప్రస్తుతం మెటా) వినియోగదారుల డేటాను కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ సేకరించి, రాజకీయ ప్రచారాల కోసం దుర్వినియోగం చేసిందనేది ప్రధాన ఆరోపణ. ఇదొక బ్రిటిష్ కన్సల్టింగ్ సంస్థ. యూజర్ల సమ్మతి లేకుండా ఆ డేటా తీసుకోవడం అప్పట్లో పెను సంచలనమైంది. ఆ సంస్థకు చెందిన మాజీ ఉద్యోగి ద్వారా ఆ విషయం ప్రపంచానికి తెలిసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలేగాకుండా, బ్రెగ్జిట్ రిఫరెండం, భారత్, కెన్యా, నైజీరియా ఎన్నికల్లో కూడా ఈ సంస్థ జోక్యం చేసుకుందని ఆరోపణలు వచ్చాయి.

అవినీతిపై సమాచారమిస్తే రూ.235 కోట్ల బహుమతులు

ఈ డేటా ఉల్లంఘనలపై న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రౌల్ టోరెజ్ 2021లో మెటాపై దావావేశారు. యూజర్ల డేటా ఎవరి చేతికి వెళ్తుందనే విషయంలో కంపెనీ అబద్ధాలు చెప్పిందని ఆరోపించారు. ఈ కేసులో మెటాకు 219 బిలియన్ డాలర్ల మేర పెనాల్టీ పడుతుందని వార్తలు వచ్చాయి. అయితే, ఆ మొత్తాన్ని 25 బిలియన్ డాలర్లకు తగ్గిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## ఏపీలో పెట్టుబడులే కాదు.. ఉత్పత్తి కూడా ప్రారంభించాలి: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

అమరావతి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఈరోజు (గురువారం) రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఎస్ఐపీబీ సమావేశానికి వర్చువల్‌గా మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కందుల దుర్గేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పరిశ్రమలు, ఇంధన శాఖ, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో వివిధ పెట్టుబడి ప్రతిపాదనలపై ఎస్ఐపీబీలో అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు పెట్టుబడులుగా మారి ఉత్పత్తి ప్రారంభించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మొత్తం 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. పెట్టుబడుల సదస్సు నిర్వహించేందుకు వీలుగా విశాఖపట్నంలో ఓ అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటయ్యేలా చూడాలని ఆదేశించారు.

# పీఆర్సీ నివేదికపై ముసురుకున్న గ్రహణం.. ఉద్యోగుల ఆశలపై నీళ్లు!

- నరేందర్ ఆమూరి

హైదరాబాద్ , అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి)

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పీఆర్సీ (వేతన సవరణ సంఘం) నివేదికపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వేతన సవరణ ప్రక్రియ ముందుకు సాగకపోవడం, నివేదిక సమర్పణలో జాప్యం జరుగుతోందన్న విమర్శలు చర్చనీయాంశంగా మారాయి. కొత్త వేతన సవరణ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని ఆశించిన ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత వేతన సవరణ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో కొత్త పీఆర్సీ అమలుపై ఉద్యోగులు ఆశలు పెట్టుకోగా, గత ప్రభుత్వం 2023 ఆగస్టులో విశ్రాంత ఐఏఎస్ అధికారి శివశంకర్ నేతృత్వంలో ఏకసభ్య పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే కమిషన్ ఏర్పాటు చేసి చాలాకాలం గడిచినా నివేదిక సమర్పణ, తదుపరి అమలు ప్రక్రియపై స్పష్టత లేకపోవడం ఉద్యోగుల్లో నిరాశకు కారణమవుతోంది. వేతన సవరణ ఎప్పుడు జరుగుతుంది? కొత్త ఫిట్‌మెంట్ ఎంత ఉండనుంది? పెండింగ్ ప్రయోజనాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనే ప్రశ్నలు ఉద్యోగ వర్గాలను వేధిస్తున్నాయి. పీఆర్సీ నివేదిక సమర్పణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కమిషన్‌కు లేఖ రాసి సెప్టెంబర్



18లోగా నివేదిక అందించాలని కోరినట్లు సమాచారం. అయినప్పటికీ నిర్దేశిత గడువు దాటిన తర్వాత కూడా నివేదిక సమర్పణపై స్పష్టమైన సమాచారం వెలువడకపోవడం చర్చకు దారితీసింది. ప్రభుత్వ ఉన్నతాధికారి నుంచి లేఖ వెళ్లినప్పటికీ ప్రక్రియ ముందుకు సాగకపోవడంపై ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. నివేదిక సమర్పణలో జాప్యానికి గల కారణాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని, తదుపరి కార్యాచరణపై ఉద్యోగులకు భరోసా కల్పించాలని పలువురు కోరుతున్నారు. మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ ఖర్చులు, విద్య, వైద్య అవసరాల నేపథ్యంలో వేతన సవరణ ఆలస్యం ఉద్యోగులపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త ఫిట్‌మెంట్ అమలులోకి వస్తే లభించే అదనపు వేతన ప్రయోజనాలు అందక ఉద్యోగులు ఆశించిన ఆర్థిక ఉపశమనానికి దూరమవుతున్నారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. సచివాలయ స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు పీఆర్సీ అమలు కోసం ఎదురుచూస్తుండగా, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ సవరణ, గ్రాట్యుటీ తదితర ప్రయోజనాల విషయంలోనూ నిర్ణయాలు కీలకంగా మారాయి. వేతన సవరణలో జరుగుతున్న జాప్యం వల్ల తమకు అందాల్సిన ప్రయోజనాలపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన పలువురిలో నెలకొంది. ఎన్నికల సమయంలో ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారంపై వ్యక్తమైన ఆశలకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వర్గాలు కోరుతున్నాయి. పీఆర్సీ నివేదికను వీలైనంత త్వరగా తెప్పించుకుని, దానిపై సమీక్ష నిర్వహించి, వేతన సవరణ అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయి. నివేదిక ఎప్పుడు అందుతుంది? ప్రభుత్వం ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటుంది? వేతన సవరణ ఎప్పటి నుంచి అమలవుతుంది? అనే అంశాలపై అధికారిక ప్రకటన వెలువడితే ఉద్యోగుల్లో నెలకొన్న అనిశ్చితి తొలగే అవకాశం ఉంది. వేతన సవరణ అనేది ఉద్యోగుల ఆర్థిక భద్రతకు సంబంధించిన కీలక అంశం కావడంతో నివేదిక సమర్పణలో జాప్యాన్ని నివారించి, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తదుపరి చర్యలు వేగవంతం చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

# పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం: జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల కోసం నిలబడిన ధైర్యశాలిగా, అన్యాయాన్ని ఎదిరించి బలహీన వర్గాలకు అండగా నిలిచిన వ్యక్తిగా పండుగ సాయన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన జీవితం ధైర్యానికి, పోరాట పటిమకు, ప్రజల పట్ల బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. ముఖ్యంగా యువత అన్యాయానికి దూరంగా ఉంటూ న్యాయం వైపు నిలబడాలని, సమాజంలో శాంతి, సామరస్యం, సమానత్వం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పోలీసులుగా ప్రజల







భద్రతను కాపాడటం, బలహీన వర్గాలకు అండగా నిలవడం, బాధితులకు చట్ట పరిధిలో న్యాయం అందించడం తమ ప్రధాన బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలుగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహనీయుల సేవలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు చేరుతాయని తెలిపారు. పండుగ సాయన్న ఆశయాలను స్మరించుకుంటూ సమానత్వం, న్యాయం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్‌తో పాటు పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. తెలంగాణలో నీటి భద్రతకు సవాల్







- నరేందర్ ఆమూరి సామాజిక రాజకీయ విశ్లేషకులు

హైదరాబాద్ , అక్టోబర్ 22 (సందేశం టైమ్స్ ప్రత్యేక కథనం)

హైదరాబాద్ తెలంగాణ లో ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో తెలంగాణలో నీటి భద్రతపై ముందస్తు ప్రణాళికలు అవసరమనే చర్చ మొదలైంది. ఎల్‌నినో కారణంగా కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నప్పటికీ, ప్రతిసారీ కరువు తప్పనిసరిగా వస్తుందని చెప్పలేం. రాష్ట్రంలో వ్యవసాయం వర్షపాతం, సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, భూగర్భజలాలపై ఆధారపడి ఉన్నందున వర్షాలు తగ్గితే పంటల సాగుతో పాటు నీటి లభ్యతపైనా ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగుపై రైతులకు ముందస్తు సూచనలు అందించి, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై అవగాహన కల్పించాలి. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలాల పెంపు, నీటి వృథా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి. వాతావరణ శాఖ అంచనాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి, రైతులకు సకాలంలో సమాచారం అందించడం ద్వారా పంట నష్టాలను తగ్గించవచ్చు. కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తమై నీటి నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం అవసరం. నీటి భద్రత ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రజలు, రైతులు, స్థానిక సంస్థల సమష్టి బాధ్యత కూడా. తెలంగాణ భవిష్యత్తులో నీటి కొరతను ఎదుర్కోకుండా ఉండాలంటే ముందస్తు ప్రణాళిక, సమర్థ నీటి నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం కీలకమని సామాజిక, రాజకీయ విశ్లేషకుడు నరేందర్ ఆమూరి పేర్కొన్నారు.

## పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా ఘన నివాళులు..



అక్టోబర్ 23(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్)

నర్సాపూర్: పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా నర్సాపూర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న సేవలను, ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణ రావు, సర్పంచులు ఉదయ్ కుమార్, నరేందర్, శివ కుమార్, నాయకులు తొట్ల ఎల్లయ్య, నాగేష్, బాలరాజు, దుర్గేష్, భాస్కర్, ప్రసాద్, మహేష్, కృష్ణ, దర్శనం, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావుకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాద్రి పృథ్విరాజ్...



అక్టోబర్ 23(సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్)

దసరా పండుగ సందర్భంగా పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి గారితో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు గారిని కలిసిన మాద్రి పృథ్వీరాజ్ దవిజయదశమి దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు గారిని పటాన్చెరు ఎమ్మెల్యే శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారితో కలిసి మాద్రి పృథ్వీరాజ్ గారు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా పండుగ సందర్భంగా పెద్దలను కలిసి వారి ఆశీస్సులు తీసుకోవడం మన సంప్రదాయంలో ఒక గొప్ప ఆచారం. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.

పెద్దల ఆశీస్సులు, ఆప్యాయతలు, సంప్రదాయాల పరిరక్షణతో పండుగల స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సందేశంతో ఈ దసరా వేడుకలను ఆనందంగా జరుపుకోవడం జరిగింది అని పృథ్వీరాజ్ అన్నారు.

## మాజీ మంత్రి హరీశ్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



సంగారెడ్డి, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డిలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్ రావును చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సంగారెడ్డి 9వ వార్డు ఇన్‌చార్జి లాడే బాలు మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు నింపాలని వారు ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, అభివృద్ధి, సంతోషాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లాడే మల్లేష్, లాడే శ్రీశైలం, మల్లేశం, సంజయ్‌తో పాటు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుకూరి జగదీశ్వర్ పాల్గొన్నారు.

## చింతకాని రైల్వే స్టేషన్‌లో రైల్ జన సంవాద్



**దేగుల్వాడి గ్రామంలో అమ్మవారి నిమజ్జన మహోత్సవం అక్టోబర్ 23 (సందేశం టైమ్స్)**

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం దేగుల్వాడి గ్రామంలో అమ్మవారి నిమజ్జన ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారి దర్శనంతో గ్రామమంతా భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. డప్పుల చప్పుళ్లు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాహలం, మహిళల సందడి, చిన్నారుల ఆనందంతో గ్రామ వీధులన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. అమ్మవారిని కన్నుల పండువగా సాగనంపుతూ భక్తులంతా భక్తి భావంతో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ అద్భుతమైన వేడుకలు ప్రతి ఒక్కరి మనసును ఆనందంతో నింపాయి. ఈ ఉత్సవం మన గ్రామ ఐక్యతకు, భక్తికి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచింది. అమ్మవారి ఆశీస్సులు మన దేగుల్వాడి గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలి. అమ్మవారి దీవెనలతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి. పాడిపంటలు సమృద్ధిగా పండాలి. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలి.

## వావిలాల గ్రామ శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం

**మృతురాలి వయసు 35 నుంచి 45 ఏళ్ల మధ్య.. ఆచూకీ తెలిసినవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

**గడ్డపోతారం, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల గ్రామ శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలి వయసు సుమారు 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మృతురాలిని ఎవరైనా గుర్తించినా, ఆమెకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే జిన్నారం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. మహిళ గుర్తింపు, ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్: జిన్నారం ఎస్‌హెచ్‌ఓ -- 8712656750.

## పేదల పక్షాన నిలిచిన ప్రజావీరుడు పండుగ సాయన్న

**ఆయన పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శం: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**మెదక్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**

పేదల పక్షాన నిలిచి, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడు పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అన్నారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగా గురువారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికిపూలమాలవేసిఘనంగానివాళులర్పించారుఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పేదలకు అండగా నిలవడం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసంపోరాడటంఆయనజీవితంలోని ప్రధాన విలువలని పేర్కొన్నారు.పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం,మానవత్వం,సేవాభావాన్నిపెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, బలహీన వర్గాలకు అండగా నిలవడం ద్వారా ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, సీఐ సందీప్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**- అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**

అణగారిన, బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల కోసం పండుగ సాయన్న ప్రదర్శించిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం మెదక్ కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి యువత సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, ముదిరాజ్ సంఘం నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ క్యాంపు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొనాయిపల్లి దళితులపై దాడి.. నిందితులను అరెస్ట్ చేయాలి

**మెదక్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కొనాయిపల్లి గ్రామంలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా దళితులపై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా నిందితులను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. మరో 48 గంటల్లోగా నిందితులను అరెస్టు చేయకపోతే డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దళితులపై దాడిని నిరసిస్తూ గురువారం కేవీపీఎస్, డీబీఎఫ్, ఎంసీఎఫ్, ఏఐఏడబ్ల్యూయూ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్‌తో పాటు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. అడివయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో స్కైలాబ్ బాబు మాట్లాడుతూ కొనాయిపల్లి గ్రామ సర్పంచ్ మన్నే కళ్యాణ్ స్వయంగా కర్రలు తీసుకుని దళితులపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 37 ప్రకారం సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందిపై దాడి జరిగినప్పటికీ సంబంధిత అధికారులు



పట్టించుకోలేదని ఆరోపిస్తూ పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. దళితులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఘటనపై పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలని సంఘాల నాయకులు కోరారు.

# అందోల్‌లో బీఆర్ఎస్ 'అలయ్ బలయ్' వాయిదా..

# పోలీసుల అనుమతి నిరాకరణతో కార్యక్రమానికి ఆటంకం

**అందోల్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 'అలయ్ బలయ్' కార్యక్రమం వాయిదా పడింది. అక్టోబర్ 23న కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు అనుమతి నిరాకరించారని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ వెల్లడించారు. కార్యక్రమ నిర్వహణ కోసం ప్రైవేటు భూమిలో ఏర్పాట్లు చేపట్టగా, బుధవారం అక్కడికి చేరుకున్న పోలీసులు పనులను అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమం నిర్వహించేందుకు నీటిపారుదల శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తీసుకురావాలని పోలీసులు సూచించినట్లు తెలిపారు. అనంతరం



పోలీసుల అనుమతి కోసం సంగారెడ్డి డీఎస్పీని కలవగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతాపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారని క్రాంతి కిరణ్ పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావాలనే ఉద్దేశంతోనే 'అలయ్ బలయ్' కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్నామని ఆయన తెలిపారు. అయితే, కార్యక్రమ నిర్వహణకు ఆటంకాలు ఎదురవుతున్నాయని ఆరోపించారు. సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గతంలో ప్రకటించినప్పటికీ, తాజా పరిణామాల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని వెల్లడించారు. కార్యక్రమ నిర్వహణకు అనుమతులు, భద్రతాపరమైన అంశాలపై స్పష్టత వచ్చిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**- మండలానికి ఆరుగురు ప్రత్యేక అధికారుల నియామకం.. పది రోజుల్లో ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**

జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో నిలిచేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ కోసం ప్రతి మండలానికి ఆరుగురు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కో అధికారి నాలుగైదు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణ పనులను పర్యవేక్షించనున్నారు. మొదటి, రెండో విడతల్లో ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రానున్న పది రోజుల్లో నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్ల పనులను మొదలుపెట్టేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వారీగా లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభించిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలని, సమస్యల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోకుండా అవసరమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి



తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా తగిన సూచనలు, సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి ఇంటి నిర్మాణం ప్రారంభమై, నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి గడువు!

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోండి**




హైదరాబాద్, అక్టోబర్ 22 (సందేశం టైమ్స్)

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితా తయారీ ప్రక్రియ కొనసాగుతోంది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు 2026 నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించినట్లు ఎన్నికల షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**మళ్లీ నమోదు చేసుకోవడం తప్పనిసరి**

గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినవారు సైతం ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. సాధారణ అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాలో పేరు ఉన్నంత మాత్రాన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అర్హత లభించదు. సంబంధిత విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించి ప్రత్యేక పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలి.

**ఫారం--18 ద్వారా దరఖాస్తు**

పట్టభద్రుల ఓటరు నమోదుకు ఫారం--18 సమర్పించాలి. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ "జఋఞ ంఅశ్రీఖఅఞ్ణుఖు అధికారిక వెబ్‌సైట్" (హ్‌జుం://తీఅటవతీఅఎవ-బతీశ్రీ-ఎఱఖ-అశీఅ.అఅఋఞ్ణీఅం/0) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి (జు-ూ), సహాయ ఎన్నికల నమోదు అధికారి (ూజు-ూ) లేదా నియమిత అధికారులకు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తును నేరుగా అందజేయవచ్చు. నిబంధనలకు అనుగుణంగా పోస్టు ద్వారా కూడా దరఖాస్తు సమర్పించే అవకాశం ఉంది.

**ఓటరు జాబితా షెడ్యూల్**

ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 6న దరఖాస్తుల స్వీకరణ ముగియనుంది. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను డిసెంబర్ 10 వరకు స్వీకరిస్తారు. అనంతరం డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రచురించేందుకు షెడ్యూల్ రూపొందించారు.

**ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల పాత్ర కీలకం**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతులకు తమ సమస్యలు, విద్యారంగ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, యువత భవిష్యత్తు వంటి అంశాలపై తమ అభిప్రాయాలను ఓటు ద్వారా వ్యక్తం చేసే అవకాశాన్ని కల్పిస్తాయి. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సామాజిక, రాజకీయ విశ్లేషకుడు నరేందర్ ఆమూరి సూచించారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులకు కూడా పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

# నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ రైతులు సుసంపన్నులు కావాలి

చింతకాని, అక్టోబర్ 23(సందేశం టైమ్స్ చింతకాని మండల ప్రతినిధి):

ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ రైతువేదికలో గురువారం ఖేతి బచావో.. క్షేత్ర బచావో అభియాన్ (పొలాలను కాపాడుకుందాం) -- ఆరోగ్యకరమైన నేల, సుసంపన్న రైతు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఐ. వాణిశ్రీ, మాత్యేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి (డీఎస్‌హెచ్ఓ) ఎం.వి. మధుసూదన్, చింతకాని మండల వ్యవసాయ అధికారి ముఖ్యంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, పొలాలను సంరక్షించడం, సేంద్రియ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చని రైతులకు వివరించారు. నేల పరీక్షలు చేయించి, భూసారానికి అనుగుణంగా ఎరువులు, పురుగుమందులను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు. పంటల సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు నేల సారాన్ని కాపాడే పద్ధతులను పాటించాలని తెలిపారు. ఆరోగ్యకరమైన నేలతో నాణ్యమైన పంటలు పండించడంతోపాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుని రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాగులవంచ పీఏసీఎస్ చైర్మన్ శేషగిరిరావు, ఉపసర్పంచ్



శరత్, సీతవో శ్రీనివాస్, ఉద్యానవన శాఖ అధికారి విష్ణు, సొసైటీ డైరెక్టర్ మద్దినేని పరిమిత, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు అంబటి శాంతయ్య, ఎల్లంపల్లి సతీష్, అంబటి శ్రీను, వినయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కృష్ణా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లకు నిలుపుదల కల్పించాలి..
## పూరి ప్యాసింజర్‌ను పునరుద్ధరించాలి..
## ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

చింతకాని, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి):

చింతకాని రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా గురువారం భారతీయ రైల్వే ఆధ్వర్యంలో 'రైల్ జన సంవాద్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ మేనేజర్ వి.ఆర్.ఎల్.వి. శాస్త్రి అధ్యక్షత వహించగా, మహబూబాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్ కుమార్, స్టేషన్ మాస్టర్ రాఘవ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతకాని గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, గ్రామ పెద్దలు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు రైల్వే అధికారులకు తమ సమస్యలను వివరించి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. చింతకాని రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు నిలుపుదల కల్పించాలని, అదేవిధంగా గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు కూడా నిలిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ రైళ్ల



నిలుపుదలతో తీర్థయాత్రలకు వెళ్లే భక్తులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గతంలో నడిచిన పూరి ప్యాసింజర్ రైలును తిరిగి పునరుద్ధరించాలని, పెద్దపల్లి--విజయవాడ మధ్య ప్యాసింజర్ రైలును నడిపేందుకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను అభ్యర్థించారు. రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రాత్రివేళ ప్రయాణికుల భద్రత కోసం తగిన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. స్టేషన్ అభివృద్ధికి సంబంధించి పలు సమస్యలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికులు, గ్రామస్థుల నుంచి అందిన విజ్ఞప్తులను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని స్టేషన్ మేనేజర్ వి.ఆర్.ఎల్.వి. శాస్త్రి తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను అన్వేషించడం రైల్ జన సంవాద్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. చింతకాని రైల్వే స్టేషన్ అభివృద్ధికి అధికారులు ప్రాధాన్యతనిస్తూ రైళ్ల నిలుపుదలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. తమ విజ్ఞప్తులపై రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# భూ రీ సర్వేను పక్కాగా నిర్వహించి భూ తగాదాలను పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ నగేష్





మెదక్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

భూ రీ సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించి, రైతుల మధ్య భూ తగాదాలు తలెత్తకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. గురువారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వేను ఖచ్చితమైన వివరాలతో నిర్వహించాలని, రైతులకు భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే మండలంలో 1,200 ఎకరాల్లో భూ రీ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో భూముల వివరాలను పరిశీలించి, పక్కా సమాచారంతో సర్వేను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. భూ రీ సర్వే ద్వారా భూముల వివరాల్లో పారదర్శకత పెరగడంతోపాటు రైతుల మధ్య వివాదాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, ఏడీ ల్యాండ్ సర్వే కిషన్, తహసీల్దార్ ఆంజనేయులు, నాగరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ డీఎస్పీ, సీఐలకు విజయదశమి శుభాకాంక్షలు

**పోలీసుల సేవలు అభినందనీయం.. మానవ హక్కుల పరిరక్షణే సంస్థ లక్ష్యం**




జహీరాబాద్, అక్టోబర్ 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో గురువారం నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. రవిని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. పండరి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు కొల్లూరు నాగేష్, జహీరాబాద్ డివిజన్ మహిళా రక్షణ విభాగం సంయుక్త కార్యదర్శి బి. సుమిత్ర పాల్గొన్నారు. విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని వారు ఆకాంక్షించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల రక్షణకు పోలీసులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజాసేవ లక్ష్యాలుగా తమ సంస్థ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. పండుగలు ప్రజల మధ్య ఐకమత్యం, సోదరభావం పెంపొందించేందుకు దోహదపడాలని ఆకాంక్షిస్తూ పోలీసు అధికారులకు మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పది రోజులుగా పంచర్‌తో నిలిచిన 108 అంబులెన్స్

**అత్యవసర వైద్య సేవలకు అంతరాయం.. ప్రత్యామ్నాయ వాహనం ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్**




**చౌటకూర్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలో 108 అంబులెన్స్ టైరు పంచర్ కావడంతో గత పది రోజులుగా నిలిచిపోయింది. దీంతో అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి మరమ్మతు చేయాల్సిన వాహనాన్ని ఇన్ని రోజులుగా నిలిపివేయడంపై అధికారుల నిర్లక్ష్యాన్ని విమర్శిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు 108 అంబులెన్స్ కీలకమని, అలాంటి వాహనం పది రోజులుగా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అంబులెన్స్‌కు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అప్పుల చెల్లింపుల సమస్యలతో మనస్తాపానికి గురైనట్లు భార్య ఫిర్యాదు

**నర్సాపూర్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికి చెందిన కంచం బిక్షపతి (32) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అప్పుల చెల్లింపుల సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఈ నెల 20న ఇంట్లో ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే బిక్షపతికి భార్య శేకమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత వారం రోజులుగా అప్పుల చెల్లింపుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పినప్పటికీ ఆయన తీవ్ర మనోవేదనకు గురైనట్లు శేకమ్మ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు శేకమ్మ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరుచుకోలేదు. దీంతో పక్కింటివారి సహాయంతో తలుపులు తెరిచి చూడగా, బిక్షపతి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే స్థానికులు ఆయనను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, అదే రోజు రాత్రి 8.30 గంటలకు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 22వ తేదీ తెల్లవారుజామున 2.30 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన భర్త మృతిపై ఎవరి మీదా అనుమానం లేదని శేకమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు ఆధారంగా నర్సాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ఎస్‌హెచ్ఓ ఏ. రంజిత్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

## మండలంలో ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు.

**మండలంలో ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు.**

**అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



బెల్లంకొండ మండలంలో 13 ఎంపీటీసీ నామినేషన్లు దాకాలైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెనాలి రాజు తెలిపారు మొదటి నామినేషన్ లక్ష్మీనారాయణ వేయగా వీటిలో టిడిపి తరఫున 11 మంది నామినేషన్ వేశారు జనసేన తరఫున ఇద్దరు నామినేషన్లు వేసినట్లు పేర్కొన్నారు ఈనెల 23న మరిన్ని నామినేషన్ దాఖలు అయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. అభ్యర్థులు కార్యకర్తలు ప్రశాంత వాతావరణం లో నామినేషన్లను ప్రక్రియను జరుపుకోవాలని తెలియపరిచారు.

## ప్రజా వీరుడు పండుగ సాయన్న.. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు.. కలెక్టరేట్‌లో ఘనంగా 174వ జయంతి వేడుకలు**






**సూర్యాపేట, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):**
నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి నిరుపేదల ఆకలి తీర్చిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగ సాయన్నను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలుస్తారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. నిజాం పాలకుల ధాన్యాగారాల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చి పేదలకు పంచిపెట్టేవారని వివరించారు. ధనవంతులు, పెట్టుబడిదారులు, భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం సాగించారని కొనియాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన పండుగ సాయన్న చిన్నతనం నుంచే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని కలెక్టర్ తెలిపారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం సాగిస్తూ పేదల పక్షాన నిలిచిన గొప్ప ప్రజా వీరుడిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డీసీఓ శ్రీరామ్, ముదిరాజ్ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు ఈదుల యాదగిరి, కళా కరుణాకర్, కందుల రమేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల నరసింహ, జై గౌడ అధ్యక్షుడు బూర మాల్సూర్ గౌడ్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పి. వీరాచారి, టీయూడబ్ల్యూజే ఐజేయూ సూర్యాపేట జిల్లా ప్రచార కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాం ప్రభు, మాజీ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి దున్న శ్యాం, వివిధ సంఘాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరన్ దిబ్బలో మేలుకోలుపు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**- డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన**

**మెదక్/అల్లాదుర్గం, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి):**
మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామంలో మేలుకోలుపు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఐపీఎస్ అధికారి శ్రీనివాస్ రావు, తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మార్గదర్శకత్వంలో అల్లాదుర్గం ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రతా నియమాల పాటింపు, బాల్యవివాహాల నివారణ, మద్యపానం వల్ల కలిగే దుష్పరిణామాలపై గ్రామస్తులకు వివరించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం, నేరాల నివారణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. గ్రామస్తులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరప్ప, గ్రామ పెద్దలు, యువజన నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





## దసరా సందర్భంగా ఆందోల్‌లో 'అలయ్ బలయ్'

**- మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో అక్టోబర్ 23న నిర్వహణ.. సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా వేడుకలు**

**ఆందోల్, అక్టోబర్ 22 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
దసరా పండుగను పురస్కరించుకుని సోదరభావం, ఐక్యతతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే లక్ష్యంతో సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో 'అలయ్ బలయ్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో అక్టోబర్ 23, శుక్రవారం ఈ కార్యక్రమం జరగనుంది. ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో తాడ్‌దాన్‌పల్లి ఎక్స్ రోడ్ సమీపంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. దసరా పండుగ నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలంతా ఒకచోట చేరి పరస్పరం ఆత్మీయంగా పలకరించుకోవడం, సోదరభావాన్ని పెంపొందించుకోవడం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజలు పరస్పర శు భాకాంక్షలు తెలుపుకుంటూ ఐక్యతను చాటాలని పేర్కొన్నారు. ఆందోల్ నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల



నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి క్యాంపు కార్యాలయం కోరింది.

## నర్సాపూర్‌లో ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు

**చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, పలువురు నాయకులు**

**నర్సాపూర్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



తెలంగాణ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన పోరాట యోధుడు పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పండుగ సాయన్న సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అన్యాయాలను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలిచిన పండుగ సాయన్నకు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఆయన ధైర్యసాహసాలు, పోరాట పటిమ, ప్రజల్లో సంపాదించుకున్న గుర్తింపు చిరస్మరణీయమని కొనియాడారు. చారిత్రక వీరుల త్యాగాలను, పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత పండుగ సాయన్న వంటి పోరాట యోధుల జీవిత చరిత్రను తెలుసుకుని, వారు చూపిన మార్గంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం వంటి విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొని పండుగ సాయన్నకు ఘనంగా నివాళులర్పించారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి..

**-నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలి.. ప్రతి నీటి బొట్టును సంరక్షించాలి**

**-జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**సందేశం టైమ్స్:**
జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. రాబోయే యాసంగి సీజన్‌లో నీటి వనరుల లభ్యతను అంచనా వేసి సాగు నిర్ణయాలు తీసుకోవాలని, ప్రతి నీటి బొట్టును సమర్థంగా వినియోగించుకుంటూ నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గురువారం సదాశివనగర్ మండలం ధర్మారావుపేట గ్రామంలోని రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు, పత్తి మార్కెటింగ్, కనీస మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, మార్కెటింగ్ విధానాలు, మద్దతు ధరలకు సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేయాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం, ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులతో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రంతో పాటు కామారెడ్డి జిల్లాలోనూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టం సుమారు నాలుగు నుంచి ఐదు మీటర్ల మేర తగ్గిందని పేర్కొన్నారు. సదాశివనగర్, పెద్దకొడప్గల్, మహమ్మద్‌నగర్ తదితర మండలాల్లో వర్షపాతం లోటుతో పొడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. రాబోయే ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు నీటి నిర్వహణ పరంగా అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చిన్న చెరువులు, ఇతర నీటి వనరుల్లో అందుబాటులో ఉన్న నీటిని అంచనా వేసి రైతులు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళికలు రూపొందించుకోవడం ద్వారా పంట నష్టాలను, ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు నివారించవచ్చని తెలిపారు. ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను బట్టి వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, వేరుశనగ వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేయకుండా అధిక నీటి అవసరమయ్యే పంటలను సాగు చేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూమి స్వభావం, నేల లక్షణాలు, నీటి లభ్యత, పంటల అవసరాలను పరిగణనలోకి తీసుకొని సరైన పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలి నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి వద్ద, ప్రతి గ్రామంలో వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంకుడు గుంతలు, వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పునరుద్ధరణ నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు అందుబాటులో ఉన్న నీటిని అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలు ఇబ్బందికరంగా మారకుండా ఇప్పటి నుంచే నీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ సాగు ఖర్చులు తగ్గించాలి ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా నేల ఆరోగ్యాన్ని కాపాడటం, భూసారాన్ని పునరుద్ధరించడం, రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం, పంట మార్పిడి విధానాన్ని పాటించడం, పంట వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం వంటి శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని



తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను క్రమంగా అవలంబించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలని సూచించారు. ఉద్యాన పంటలతో అదనపు ఆదాయానికి అవకాశం రైతులు తమ భూమి స్వభావం, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా ఆయిల్‌పామ్, కూరగాయలు తదితర ఉద్యాన పంటల సాగును కూడా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సంప్రదాయ పంటలతో పాటు అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. అయితే పంటల ఎంపికలో మార్కెట్ పరిస్థితులు, సాగు ఖర్చులు, దిగుబడి అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విజ్ఞప్తి చేశారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టడం, వర్షపు నీటిని సంరక్షించడం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, తహసీల్దార్, మార్కెటింగ్ అధికారి రమ్య, సత్యనారాయణ, ఎంపీడీవో, ఎంపీపీ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.
2

# వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి..

**-స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**-వెట్టిచాకిరీ బాధితులు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలి**

**సందేశం టైమ్స్:**
వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కుల పరిరక్షణ, బాధితులకు అందించే ప్రభుత్వ సహాయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టిచాకిరీ నిరోధక చట్టం అమల్లో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని, బాధితులను గుర్తించి రక్షించడంతో పాటు వారికి అవసరమైన పునరావాసం, ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మికులకు తమ హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులపై అవగాహన జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో



పర్యటించనున్న 'స్వేచ్ఛా రథం' ద్వారా అసంఘటిత రంగ కార్మికులు, వెట్టిచాకిరీకి గురయ్యే ప్రమాదం ఉన్న వర్గాలకు అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, చేపలు, రొయ్యల పెంపకం, గనులు, క్వారీల్లో పనిచేసే కార్మికులకు వెట్టిచాకిరీ వల్ల కలిగే అనర్థాలు, కార్మికుల హక్కులు, ఫిర్యాదులు నమోదు చేసే విధానాలపై వివరించనున్నారు. అప్పులు, ముందస్తు చెల్లింపులు, ఇతర ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా బలవంతంగా పనిచేయాల్సిన పరిస్థితుల్లో చిక్కుకున్న కార్మికులకు చట్టపరమైన రక్షణ, ప్రభుత్వ సహాయ వ్యవస్థల గురించి తెలియజేయనున్నారు. కరపత్రాలు, ఇతర సమాచార సామగ్రి ద్వారా గ్రామీణ ప్రాంతాలు, పని ప్రదేశాల్లో విస్తృత ప్రచారం చేపట్టనున్నారు. బాధితుల కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ వెట్టిచాకిరీకి గురైనవారు లేదా అలాంటి ఘటనల గురించి తెలిసినవారు 080-69434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. బాధితులను గుర్తించడం, వారిని బలవంతపు శ్రమ నుంచి విముక్తి చేయడం, పునరావాసం కల్పించడం, వారికి న్యాయం అందేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలనకు అధికారుల ప్రతిజ్ఞ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డాక్టర్ మున్నం శశికుమార్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. వెట్టిచాకిరీ నిర్మూలన కోసం కట్టుబడి పనిచేయాలని, బాధితులను గుర్తించి రక్షించడంతో పాటు వారికి పునరావాసం కల్పించేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, అంతర్జాతీయ న్యాయ సహాయ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్‌తో పాటు కార్మిక శాఖ, పోలీసు శాఖ, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, జిల్లా న్యాయ సేవల సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెదక్‌లో రేపు పోలీస్ ఓపెన్ హౌస్ షో

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

**మెదక్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ షో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీసుల విధులు, సేవలు, త్యాగాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఓపెన్ హౌస్ షోలో భాగంగా పోలీస్ శాఖ వినియోగించే ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర తదితర అంశాలను విద్యార్థులకు వివరించనున్నారు. పోలీసుల విధులు, ప్రజల రక్షణ కోసం వారు అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేసేందుకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు, కొవ్వొత్తుల ర్యాలీలు, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# ఏడుగురు పోలీసు సిబ్బందికి పదోన్నతులు..

# ప్రజాసేవలో మరింత బాధ్యతగా పనిచేయాలి

**- పదోన్నతి పొందిన సిబ్బందికి ర్యాంక్ చిహ్నాలు అలంకరించి అభినందించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



**మెదక్, అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**
మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఏడుగురు పోలీసు సిబ్బందికి పదోన్నతులు లభించాయి. ఈ సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పదోన్నతి పొందిన సిబ్బందికి ర్యాంక్ చిహ్నాలను అలంకరించి అభినందించారు. కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న షరీఫ్, రాజు, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, వెంకయ్యలకు పదోన్నతులు లభించగా, టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సంగయ్య, రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లేశం అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు (ఏఎస్‌ఐలు)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, పదోన్నతితో పోలీసు సిబ్బందిపై బాధ్యతలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

# భవానీ భక్తుల మృతిపై మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి

**అక్టోబర్ 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద భవానీ దీక్షలో ఉన్న నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి దర్శనం కోసం కాలినడకన వస్తున్న భవానీ భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం అత్యంత బాధాకరమని మంత్రి అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

# ఎంపీటీసీకి నామినేషన్ దాఖలు చేసిన జనసైనికులు



సందేశం టైమ్స్:
కంచికచర్ల పట్టణంలో రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు పట్టణంలోని మూడవ సెగ్మెంట్ కు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాయిని సతీష్ సతీమణి నాయిని త్రివేణి నామినేషన్ దాఖలు చేయగా నాలుగవ సెగ్మెంట్ కు పసుపులేటి గోపి నామినేషన్ దాఖలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో పాటు జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు వీధి దీపాల ఏర్పాటు పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు తమపై నమ్మకంతో అభిమానంతో ఆశీస్సులు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు తన విజయానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు నామినేషన్ కార్యక్రమం సందర్భంగా జనసైనికులు మద్దతుదారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కాండ్రపాడు ఎం.పి.టి.సి స్థానానికి యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గొటిక శివకృష్ణరెడ్డి మొదటి నామినేషన్ దాఖలు చేశారు

సందేశం టైమ్స్:


స్థానిక సంస్థల ఎన్నికలు 2026 చందర్లపాడు మండలం. కాండ్రపాడు ఎం.పి.టి.సి స్థానానికి మొదటి నామినేషన్ దాఖలు చందర్లపాడు మండలం కాండ్రపాడు ఎం.పి.టి.సి స్థానానికి యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గొటిక శివకృష్ణరెడ్డి రిటర్నింగ్ అధికారి వద్ద తన నామినేషన్‌ను దాఖలు చేశారుఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ప్రమోద్ జ్యోతిర్మయి చిట్టి బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసం సాయి యువమోర్చా మండల అధ్యక్షుడు బాలాజీ లతో పాటు బీజేపీ నాయకులు పార్టీ కార్యకర్తలు మరియు మద్దతుదారులు వేణుగోపాలరెడ్డి ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా శివకృష్ణరెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవలో కలిసి మందుకు సాగుతానని కాండ్రపాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు

# "మాదకద్రవ్యాల పై యుద్ధం" డాక్యుమెంటరీ పోస్టర్ ఆవిష్కరణ




సందేశం టైమ్స్:
మాదకద్రవ్యాల నిర్మూలన పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కోదాడకు చెందిన బచ్చలకూరి సురేష్ రూపొందించిన "మాదకద్రవ్యాల పై యుద్ధం" డాక్యుమెంటరీ పోస్టర్ను సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నరసింహ ఆవిష్కరించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు యువతపై వాటి ప్రభావాన్ని ఈ డాక్యుమెంటరీ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సురేష్ ను ఎస్పి శాలువాతో సన్మానించి అభినందించారు.

# వృద్ధురాలిని నమ్మించి దోపిడీ నిందితుడిని పట్టుకున్న పోలీసులు..

- సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న మాచారెడ్డి పోలీసులు

సందేశం టైమ్స్:
ఒంటరిగా ఇంటికి వెళ్తున్న 88 ఏళ్ల వృద్ధురాలిని నమ్మించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, బెదిరించి దాడి చేసి ఆభరణాలు, నగదు దోపిడీ చేసిన నిందితుడిని మాచారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి కేసును ఛేదించారు. నిందితుడి నుంచి నాలుగు వెండి కడియాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్జనాయక్ తండాకు చెందిన ఆగుళ్ల ఈరమ్మ (88) ఈ నెల 21న మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో మాచారెడ్డి చౌరస్తాలోని కల్లు దుకాణం వద్ద నుంచి ఇంటికి తిరిగి వెళ్తోంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి చెట్టు కొమ్మ చూపిస్తానని నమ్మించి ఆమెను ఆటోలో ఎక్కించుకున్నాడు. అనంతరం చుక్కాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ వృద్ధురాలిని బెదిరించి, చేతులతో కొట్టి ఆమె వద్ద ఉన్న వెండి కడియాలు, ఒక గ్రాము బరువున్న బంగారు ముక్కుపుడకతో పాటు సంచిలోని కొంత నగదును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో దోపిడీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితుడి గుర్తింపు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, మాచారెడ్డి ఎస్ఐ కె. విజయ్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. నేరం జరిగిన ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అక్టోబర్ 22న నిందితుడు ఆలకుంట అలియాస్ దండుగుల సాయులు (34), చంద్రయ్య కుమారుడు,ను అదుపులోకి తీసుకుని విచారించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన సాయులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత ఖర్చులకు డబ్బులు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు



పేర్కొన్నారు. నిందితుడి నుంచి నాలుగు వెండి కడియాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు సాంకేతిక ఆధారాల సహాయంతో కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన మాచారెడ్డి ఎస్ఐ కె. విజయ్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ అభినందించారు. ప్రజల భద్రతకు, ముఖ్యంగా వృద్ధులు, ఒంటరిగా సంచరించే వ్యక్తుల రక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. వృద్ధులు ఒంటరిగా ప్రయాణించే సమయంలో అపరిచితులు చెప్పే మాటలను నమ్మి వారి వెంట వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
5

# కామారెడ్డిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు..

-సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యానికి సాయన్న జీవితం స్ఫూర్తిదాయకం

సందేశం టైమ్స్:
తెలంగాణలో ధైర్యసాహసాలకు, ప్రజా పోరాటాలకు ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముఖ్య అతిథిగా హాజరుకాగా, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు



వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండుగ సాయన్న ధైర్యసాహసాలు, ప్రజల కోసం ఆయన సాగించిన పోరాటాలను స్మరించుకున్నారు. ఆయన చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంతోపాటు సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. పాల్గొన్నవారు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, సహాయ బీసీ అభివృద్ధి అధికారి మామిండ్ల చక్రధర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్ ముదిరాజ్, మాజీ జడ్పీటీసీ నంద రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జల భిక్షపతి ముదిరాజ్, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కల్ల గంగారాజం ముదిరాజ్, కౌన్సిలర్లు కల్ల గణేష్ ముదిరాజ్, భాను ప్రసాద్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలా నాగరాజు ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విట్టల్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బహుజన సంఘ నాయకులు కొత్తపల్లి మల్లయ్య, ఒడ్డెర ఎల్లయ్య, టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, నరేష్, పవన్, సునీత, స్వామి, శాంతీష్ తదితరులు పాల్గొన్నారు.
4

# సూర్యాపేట 15వ వార్డులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రం ప్రారంభం

సందేశం టైమ్స్:
సూర్యాపేట పట్టణంలోని 15వ వార్డులో వార్డు కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం--వరంగల్--నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మొరిశెట్టి నివేదిత. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించడంతో పాటు, నమోదు సమయంలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఇలాంటి సహాయ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం--వరంగల్--నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పట్టభద్రులంతా ఐక్యంగా ముందుకు వచ్చి ప్రజాస్వామ్య




విలువలను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వార్డు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.
14

# బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధులు పండుగ సాయన్న



సందేశం టైమ్స్:
బహుజనుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధులు పండుగ సాయన్న అని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ కొనియాడారు. ఈరోజు బుధవారం నాడు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పండుగ సాయన్న 174వ జయంతి ని పురస్కరించుకొని వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. మహనీయులు సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించడం జరిగింది. ఈ జయంతి కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు తన్నీరు రాంబాబు, చెల్లమళ్ళా నరసింహ తదితర బీసీ సంఘ రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొన్నారు.